క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో ఎమ్మెల్సీ మధుసూదన్



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

గుంతకల్లు రూరల్: కర్నూలు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఈఓ కే.వాణి ఇతర సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్సీ కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'మా కడుపులు కొట్టొద్దు'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

పామిడి: రేషన్ పంపిణీకి సంబంధించి ఎండీయూ వాహనాలను తొలగించి తమ కడుపులు కొట్టొద్దంటూ ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం ఎండీయూ వాహన ఆపరేటర్, డీలర్ బషీర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎన్. శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాల రద్దును కేబినెట్ ఆమోదించడంపై వారు ఆవేదన వ్యక్తంచేశారు. అగ్రిమెంటు ప్రకారం ఇంకా 20 నెలల కాలవ్యవధి ఉండగా, ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా వాహనాలను రద్దు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

25న కంటి మెగా వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్: బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న పాతగుంతకల్లులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉచిత కంటి మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి, క్యాంప్ క్షేత్రాధికారి శివశంకర్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి బెంగళూరుకు తీసుకెళ్లి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేయిస్తామన్నారు. వివరాలకు 7981652521 నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

మిల్లులో ప్రత్యామ్నాయ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి



డీవైఎఫ్‌ఐ నూతన కార్యవర్గం

గుంతకల్లుటౌన్: మూతపడిన ఆంధ్రా కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు స్థలంలో టెక్స్‌టైల్ పార్క్ లేదా ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం డీవైఎఫ్‌ఐ నూతన పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణ కార్యదర్శిగా సురేంద్ర, అధ్యక్షుడిగా చంద్రశేఖర్, 21 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు.

నెట్టికంటుడికి వాటర్ ట్యాంకు వితరణ



ట్యాంకర్‌ను బహూకరిస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: పట్టణానికి చెందిన కాశంశెట్టి చందు విద్యాసాగర్, శ్రీనాథ్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానానికి గురువారం వాటర్ ట్యాంకును విరాళంగా అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ట్యాంకును విరాళంగా అందజేసినట్లు దాతలు తెలియజేశారు. దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈఓ కే వాణి ఆధ్వర్యంలో దాతలకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అనంతలో విధుశేఖర స్వామి

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మప్రచార యాత్రలో భాగంగా శృంగేరీ మఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి గురువారం రాత్రి నగరంలోని శృంగేరీ శారదా శంకర మఠానికి విచ్చేశారు. వేదపండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు, అర్చకులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మఠంలో కొలువుదీరిన శారదా శంకరులు, చంద్రమౌళీశ్వరుడికి స్వామి రుద్రాభిషేకాలు చేశారు. ఆధ్యాత్మిక మార్గంలో నడిచి ధర్మాన్ని కాపాడాలని భక్తులకు సూచించారు.



అలంకరణలో పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లి అభయాంజనేయస్వామి



రాయలచెరువులోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



గుత్తిలో ఆంజనేయుడిని పల్లకీలో ఊరేగిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



పెద్దవడుగూరులో హనుమంతుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



ఆంజనేయస్వామిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హనుమా.. మముగనుమా!

యాడికి: మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని చింతవనం ఆంజనేయ స్వామి ఆలయం, పెద్దపేట సంజీవరాయ స్వామి ఆలయం, రాయలచెరువులో చందన గేట్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి, కోనుప్పలపాడు ఆంజనేయస్వామి, చందనలో ఆంజనేయ స్వామి ఆలయాల్లో అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయలచెరువు, యాడికి చింతవనం ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం వైభవంగా జరిపించారు. ఆంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని భక్తులు స్వామికి టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా గురువారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కొట్టాలపల్లి అభయాంజనేయస్వామి వెండికవచరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భజనబృందం సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. భక్తులకు హనుమాన్ ఆలయాల్లో తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

శింగనమల: మండలంలోని శింగనమల, గోవిందరాయునిపేట, పెద్దమట్లగొంది, సలకంచెరువు, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, వెస్ట్ నరసాపురం, ఆకులేడు గ్రామాల్లో గురువారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. శింగనమలలో దుర్గాంజనేయ ఆలయం, చిన్నకాలువ సమీపంలోని అంజనేయ ఆలయంలో అర్చకులు స్వామికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా హనుమంతుడి ఊరేగింపు

గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి సందర్భంగా నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం గుంతకల్లు పట్టణం నుంచి కసాపురం దేవస్థానం వరకూ హనుమంతుడి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామివారిని పల్లకీలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. వందలాది మంది భక్తులతో హనుమాన్ చాలీసాను పఠిస్తూ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి కసాపురం దేవస్థానం వరకూ స్వామివారి ఊరేగింపు జరిగింది. అనంతరం ఆలయ సమీపంలోని వాసవి అర్యవైశ్యనిత్యాన్న సత్ర సముదాయంలో దాదాపు వెయ్యిమంది భక్తులకు అల్పాహారం అందించారు.

గార్లదిన్నె: మండలంలోని గార్లదిన్ను, పాపినేపాళ్యం, తిమ్మంపేట, ఎర్రగుంట్ల, కృష్ణాపురం, ముకుందాపురం, కోటంక, బూదేడు, పెనకచెర్లడ్యాం తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండలవ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీకేఎస్, కొట్టాపల్లి, రెడ్డిపల్లి, రేగడికొత్తూరు, సిద్దరాంపురం, చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి హనుమాన్ ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

పెద్దవడుగూరు : మండలంలోని కోటకొండ, చిత్రచేడు, పెద్దవడుగూరు, రాంపురం, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, దిమ్మగుడి, పి.కొట్టాలపల్లి తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కాయకర్పూరాలు సమర్పించారు. సాయంత్ర ఆయా గ్రామాల్లో ఎద్దుల బండ్లపై స్వామి చిత్ర పటాలను పెట్టుకొని ఊరేగించారు. మల్లేనిపల్లిలో స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది.

తాడిపత్రి రూరల్: హనుమన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారు వెండి కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో మహిళలు సామూహిక హనుమన్ చాలీసా పారాయణం చేశారు. పట్టణంలోని పుట్లూరు రోడ్డు, అశోక్‌పిల్లర్, నందలపాడు, పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీభూదేవి, శ్రీదేవి సమేత చింతలవెంకటరమణస్వామి దేవాలయంతోపాటు పలు ఆలయాల్లో అంజినేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజలు జరిగాయి. పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.



వెండి కవచాలంకరణలో ఏటిగడ్డ ఆంజనేయస్వామి



పూజలందుకున్న రాయలచెరువు అభయాంజనేయ స్వామి



గార్లదిన్నెలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



బీకేఎస్‌లో పూజలందుకున్న ఆంజనేయస్వామి



శింగనమలలో పూజలందుకున్న ఆంజనేయుడు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరిఆలయం ఎదురుగా ఉన్న ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. కందకం ఆంజనేయస్వామి, చెరువుకట్ట ఆంజనేయస్వామి, కాల్వగడ్డ ఆంజనేయస్వామి, కోటలోని దిడ్డి ఆ ంజనేయస్వామి, ఆర్ఎస్‌లోని నవరూప ఆంజనేయస్వామి స్వామి, మెయిన్ బజారు లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. అన్నదానాలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, సహాయ కార్యదర్శి సుదర్శన్, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాయి వెంకటేష్, వెంకట్, కోశాధికారి జక్కా మహేష్, ఆంజనేయస్వామి ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన కుంభాభిషేకం

యల్లనూరు: హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం గురువారం ముగిసింది. ఈసందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో రామచంద్రస్వామి పట్టాభిషేకాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయ పురవీధులు పోటెత్తాయి. వేకువజామునే స్వామికి అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణ, తోమాల సేవ, స్వర్ణ వజ్రకవచ ఆలంకరణలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించిన వేదపండితులు పూర్ణాహుతితో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా ముగించారు. సాయంత్రం స్వామిని ఒంటె వాహనంపై కొలువదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం చేపట్టారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గురువారం వేకువజామునే స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలను, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు.



సీతారామచంద్రస్వామివార్ల పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కనుల పండువగా సీతారామ కల్యాణోత్సవం

పామిడి: మండలవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తలవాలకట్టవీధిలోని కోటవరాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ కలశస్థాపన, నవగ్రహపూజ, పంచామృత అభిషేకాలు వంటి పూజలు చేపట్టారు. ఇల్లూరు చితంబరయ్య కుటుంబం ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. భక్తాదులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకూ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పామిడితో పాటు పలు గ్రామాల్లో అన్నదాన, హనుమాన్ జయంతి రథోత్సవాలు చేపట్టారు.



పామిడిలో సీతారామ కల్యాణోత్సవ దృశ్యం

అటెండర్ బాషా మృతికి నివాళి

గుంతకల్లుటౌన్: వజ్రకరూర్ తహసిల్దార్ కార్యాలయ అటెండర్ షేక్ మహబూబ్‌బాషా మృతికి గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సంతాపం తెలిపారు. విధులు ముగించుకుని బైక్ మీద గుంతకల్లు వస్తున్న మహబూబ్‌బాషా రోడ్డు ప్రమాదం మరణించడం తనను ఎంతగానో బాధించిందని ఆయన పేర్కొన్నారు. బాషా ఆత్మకుశాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

బాషాకు కన్నీటి వీడ్కోలు

రోడ్డు ప్రమాదంలో మరణించిన అటెండర్ మహబూబ్‌బాషాకు అతని మిత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం పాతబస్టాండ్ వద్ద నున్న ముస్లిం శ్మశానవాటికలో జరిగిన బాషా అంత్యక్రియల్లో వైఎస్సార్‌సీపీ యువనేత సిబి.మంజునాథరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. వీరితో పాటు పార్టీ జిల్లా నాయకుడు కొనకొండ్ల భీమిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు బాషా ఇంటికి వెళ్లి అతడి భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి అంజలి ఘటించారు.



బాషా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ యువనేత మంజునాథరెడ్డి

గొడవలకు దూరంగా ఉండండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

పెద్దవడుగూరు : ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. గురువారం మండలంలోని దిమ్మగుడి, చిత్రచేడు గ్రామాల్లో పోలీసులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలోని రౌడీషీటర్లు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 9440796826 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయండి

యల్లనూరు: మండలంలో ఉపాధి పనులు నాణ్యతగా చేయాలని ఎంపీడీఓ వాసు దేవారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించిన అంశాలపై హౌసింగ్ ఏఈ సుప్రజ మాట్లాడారు. కార్యక్రమంలో ఈసీ సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ కుళ్లాయి స్వామి, హరికుమార్, ఎఫ్ఏ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో జబ్బులు దూరం



యోగాసనాలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

గుంతకల్లుటౌన్: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా జబ్బులకు దూరంగా ఉంచవచ్చని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావు, యునాని వైద్యురాలు డాక్టర్ సాజిదా సుల్తానా తెలిపారు. గురువారం యునాని ఆస్పత్రిలో యోగాంధ్రా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం యోగా ట్రైనర్ శివనాగముణెమ్మ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అపర ఏకాదశి

అనంతపురం కల్చరల్: భవసార క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అపర ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తజన వల్లభుడైన పాండురంగడి నిజరూప దర్శనం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతులు లేని కోళ్ల ఫారాలు మూసేయండి

పెద్దవడుగూరు : మండలంలో అనుమతులు లేకుండా నిర్మించిన కోళ్ల ఫారాలను మూసివేయాలని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో కోళ్లఫారాలను నిర్మంచుకొన్నారని ఫిర్యాదు రావడంతో వారం రోజుల క్రితం కోళ్లఫారాల యజమానులకు నోటీసులు పంపించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫారాల యజమానులతో సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా కోళ్లఫారాలను ఎలా నిర్మిస్తారని యజమానులపై తహసీల్దార్ మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరించారు. కొండూరు, వీరన్నపల్లి గ్రామాల సమీపంలోని పొలాల్లో ఉన్న కోళ్లఫారాలను మూసివేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

ఆదివాసుల అణచివేతను ఆపాలి

పెద్దవడుగూరు : మానవ మనుగడకు మూలమైన ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణచివేతను ఆపాలని సీపీఐ మండల సీనియర్ నాయకుడు నారాయణ, సీపీఎం నాయకుడు దస్తగిరి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఈనెల 25న అనంతపురంలో నిర్వహించే శాంతిర్యాలీకి తరలిరావాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అడవుల్లో ఉన్నే ఖనిజ సంపదను కొల్లగొడితే సహించబోమని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఉషారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

గుంతకల్లుటౌన్: మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు, మరో 27 మంది ఆదివాసులపై జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్రం రద్దు చేయాలని, మావోయిస్టు పార్టీలతో ప్రభుత్వం చర్చలు జరపాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో కూలీకి తీవ్రగాయాలు

యాడికి: తిరునాంపల్లి సమీపంలో విద్యుదాఘాతంతో ఓ కూలీకి తీవ్రగాయాలయ్యాయి. విద్యుత్ ఏఈ విజయ్ తెలిపిన వివరాలు..కోనుప్పలపాడుకు చెందిన నబిరసూల్ రాఘవ అనే విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద దినసరి కూలీగా పని చేస్తున్నాడు. తిరునాంపల్లి సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభంపై పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పై నుంచి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.



గాయపడిన నబిరసూల్

సింగ్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు



పాతూరులో జరిమానా విధిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో గురువారం నగరంలోని 74 సచివాలయాల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పాతూరులో జరిగిన స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ షాపుల ముందు చెత్తాచెదారం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో భాగంగా ప్రతి వ్యాపారస్తులు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ద్వారా పర్యావరణ పరిరక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రజలందరూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్‌ను వినియోగించుకుండా క్లాత్, జూట్ బ్యాగ్‌లను వినియోగించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పర్యావరణానికి హాని కల్గించని ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చన్నారు. నగరంలోని మొత్తం 50 షాపులపై రూ.73,525 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవ్ నిరంతరంగా కొనసాగుతుందన్నారు.